ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కొనసాగుతోంది. ఈ సాయంత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేస్తారు.
2. పెట్టుబడులే లక్ష్యంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ మొదటి రోజు సుమారు 2.43 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి 35 అవగాహన ఒప్పందాలు కుదిరాయి.
3. తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగు పడిన డిసెంబర్ 9వ తేదీని విజయ్ దివస్ గా పాటించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు అన్నారు.
4. రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లాలో 7.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

-----------------------

**తెలంగాణ తల్లి**

తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదిక నుంచి వర్చ్యువల్ గా ముఖ్యమంత్రి విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల అకాంక్షలను గుర్తించి UPA ప్రభుత్వం డిసెంబరు 9 న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించిందనీ, ఆ ప్రకటన తెలంగాణా ప్రజలకు సంతోషాన్ని ఇచ్చి, ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందనీ అన్నారు.

ఏటా ఈ రోజును తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతేడాది ఇదే రోజున ప్రభుత్వం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

**(Soundbyte- CM విగ్రహాలు)**

అంతకుముందు, హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం నుంచి ఫ్యూచర్ సిటీకి హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి చేరుకున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిష్టాపన కోసం మొత్తం 5 కోట్ల 80 లక్షల రూపాయిలను ప్రభుత్వం మంజూరు చేసింది. 12 అడుగుల తెలంగాణ తల్లి విగ్రహం పీఠంలో మొత్తం 18 అడుగుల ఎత్తున్న విగ్రహాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ సంప్రదాయాలు ఉట్టిపడేలా పంట కంకులు చేతి పట్టుకుని ఉన్న ఈ విగ్రహాలను 27 జిల్లాల కలెక్టరేట్లలో ముఖ్యమంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. కాగా, మరో 6 జిల్లాలు - ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ములుగు, నల్గొండ, నారాయణపేట్ జిల్లాలలో విగ్రహాలు నిర్మాణంలో ఉన్నాయి.

**MSL**

-------------------------------

**తెలంగాణ రైజింగ్— గ్లోబల్ సమ్మిట్ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఈ సాయంత్రం తెలంగాణా రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటును ప్రభుత్వం విడుదల చేయనుంది. కాగా సదస్సు రెండోరోజు పలు రంగాలపై చర్చలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పర్యాటకం, మౌలిక సదుపాయాల విస్తరణ, రవాణా, క్రీడలు, సినిమా వంటి పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సెషన్స్ లో పాల్గొంటున్నారు. ఫ్యూచర్ రెడీ టూరిజం పేరిట ఏర్పాటయిన సెషన్ లో రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి క్రుష్ణారావు, హాస్పిటాలిటీ రంగ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలో రహదారులు విస్తరణ, భవిష్యత్ ప్రణాళికలపై మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి దేశ విదేశీ ప్రతినిధులకు వివరిస్తున్నారు. రాష్ట్ర క్రీడా విధానంపై ఏర్పాటయిన ప్రత్యేక చర్చలో ఆ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

వివరిస్తున్నారు. మరో సెషన్ లో పట్టణ గ్రామీణ ప్రాంతాల రవాణా అనుసంధానం గురించి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలో పాల్గొనగా, రాష్ట్రంలో సినిమా పరిశ్రమ విస్తరణ గిరించి మరో సెషన్ లో సినిమా ప్రముఖులు పాల్గొన్నారు. ఆయా రంగాలలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహం, పరిశ్రమ అవసరాలు వంటి పలు అంశాలను ఈ సందర్భంగా విస్తృతంగా చర్చిస్తున్నారు. కాగా, ఈ రోజు రెండో రోజు కూడా పలు రంగాలకు సంబంధించి మరి కొన్ని అవగాహన ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది.

**MSL**

-----------------------------

**FIRST DAY**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ మొదటి రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 2.43 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి 35 అవగాహన ఒప్పందాల (MoU) పై సంతకం చేసింది. ప్రతిష్టాత్మక తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో మొదటి రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ వంటి వివిధ రంగాలకు సంబంధించి ఈ అవగాహన ఒప్పందాలపై సంతకం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

బ్రూక్‌ఫీల్డ్, యాక్సిస్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్టియంతో డీప్ టెక్, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో 75 వేల కోట్ల రూపాయల పెట్టుబడుల కోసం ప్రతిపాదనలు అందాయని రాష్ట్ర అధికారులు తెలిపారు. ఈ నిధి భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి వినియోగించనున్నట్లు వారు తెలియజేశారు. పునరుత్పాదక ఇంధన రంగంలో, విన్ గ్రూప్ తదుపరి తరం పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, అధునాతన EV మౌలిక సదుపాయాలు, స్మార్ట్ అర్బన్ ప్లానింగ్‌లను కవర్ చేసే ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుల కోసం 27 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయి. పునరుత్పాదక ఇంధన పరివర్తన, విద్యుత్ భద్రతా రంగంలో,

దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు కుదిరాయి. ఎవ్రెన్, యాక్సిస్ ఎనర్జీ నుండి 31 వేల 500 కోట్ల రూపాయల ఏకైక అతిపెద్ద ఇంధన ఒప్పందం జరిగింది.

**ఎస్ఎస్డీ**

------------------------------

**సెషన్స్**

తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సమ్మిట్ లో వరుస చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నారు. తొలిరోజు పలు అంశాలపై జరిగిన వివిధ రంగాల చర్చల్లో మంత్రులు కీలకోపన్యాసాలు చేశారు.

'పవరింగ్ తెలంగాణ 2047: ఎనర్జీ ట్రాన్సిషన్, క్లైమేట్ ఫైనాన్స్ అండ్ జస్ట్ ట్రాన్సిషన్ ఫర్ నెట్ జీరో' అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు.

'గ్రీన్ మొబిలిటీ 2047-జీరో ఎమిషన్ వాహనాలు' అనే అంశంపై నిర్వహించిన చర్చలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలకోపన్యాసం చేస్తూ.. శూన్య ఉద్గారాల రవాణాలో.. తెలంగాణను దేశానికి దిక్సూచిగా మారుస్తామని స్పష్టం చేశారు. 2047 నాటికి రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలే తిరుగుతాయని, కాలుష్య రహిత రవాణా.. సురక్షిత రహదారులే తెలంగాణ భవిష్యత్ లక్ష్యాలని పేర్కొన్నారు.

'మహిళల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను పెంచడం' అనే అంశంపై చర్చలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలు అభ్యున్నతి సాధిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని.. ఈ మార్పునకు తెలంగాణ నాయకత్వం వహిస్తుందని అన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి గ్లోబల్ సమిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గ్లోబల్ సదస్సులో మొదటిరోజు "విలువ ఆధారిత ఉత్పత్తుల గొలుసు విధానం-రైతుల ఆదాయం రెట్టింపు" అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

**జీఎస్**

-----------------------------------

**కేటీఆర్**

తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు పేర్కొన్నారు. విజయ్ దివస్ సందర్భంగా ఆయన ఎక్స్‌లో.. కేసీఆర్ దీక్ష విరమించిన ఫోటోలు షేర్ చేశారు. సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం, కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షతో ఢిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏళ్లు పూర్తయిందని తెలిపారు. నవంబర్ 29న దీక్షా దివస్ లేకుంటే డిసెంబర్ 9 విజయ్ దివస్ లేదన్న ఆయన.. డిసెంబర్ 9 లేకుంటే జూన్ 2 లేదని అన్నారు.

**ఎక్స్**

---------------------------

**ఉపాధి హామీ**

మహాత్మా గాంధీ  జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పశువులపాకలు, గొర్రెల పాకలు కోళ్ల ఫామ్స్ కు  సంబంధించి  అవకాశం  ఉందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్,  ఇప్ప ధనుంజయ్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.......

**<u>బైట్</u> - ధనుంజయ్**

**పీటీసీ - సిరిసిల్ల**

-------------------------------

**ముక్కోటి**

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 30న జరిగే ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

**బైట్ - జితేష్**

**పీటీసీ - భద్రాద్రి**

-----------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. వివిద జిల్లాల్లో ఉదయం పొగ మంచుతో రోడ్లు కమ్ముకుపోతున్నాయి. సాయంత్రం నుంచే చలి మొదలవుతుంది. కాగా, గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్ జిల్లాలో 7.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

**పీఎస్**

------------------------

**పోర్టల్**

పి ఎం ఏ వై పోర్టల్ లో లబ్ధిదారుల వివరాలు నిర్దేశిత గడువులోగా నమోదు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. వరంగల్ లోని పలు ప్రాంతాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి ఈ ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను సంబంధిత విభాగాల అధికారులు సూచించిన పారామీటర్ ల ప్రకారం పూర్తి చేయాలని తెలిపారు.

**పీటీసీ - వరంగల్**

------------------------------

**ఐఏఎస్ లు**

కేంద్ర ప్రభుత్వం 2024 బ్యాచ్‌కు ఎంపికైన 179 ఐఏఎస్ అధికారుల్లో ఐదుగురిని తెలంగాణకు కేటాయించింది. ఇందులో ఇద్దరు తెలంగాణ, ఒకరు ఆంధ్రప్రదేశ్, మిగిలినవారు కర్ణాటక, బిహార్‌కు చెందినవారు ఉన్నారు. రాష్ట్రానికి కేటాయించిన వారిలో ఎట్టబోయిన సాయిశివాని,

పోతురాజు హరిప్రసాద్, పి.సురేశ్, సచిన్ బసవరాజ్ గుట్టూర్, పారస్‌కుమార్ లు ఉన్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

**జీఎస్**

---------------------------------